# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

అనునిత్యం ప్రజల పక్షం

TELTEL12273

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ సంపుటి : 2 సంచిక : 185 మంగళవారం 13 - 08 - 2024 పేజీలు : 08 వెల : 5



**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న

తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209


## పంద్రాగస్ట్ వేడుకలకు

# గోల్కొండకోట ముస్తాబు

- ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్ శాంతికుమారి
- 15న తొలిసారి జెండా ఎగురేయనున్న సిఎం రేవంత్



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : రేవంత్ రెడ్డి పంద్రాగస్టు వేడుకలను గోల్కొండ కోటపైనే ప్రారంభిస్తారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి గోల్కొండపై త్రివర్ణ పతాకం ఎగురవేయనున్నారు. అనంతరం అక్కడి నుంచి రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి 2023 స్వాతంత్ర్య వేడుకల వరకు మాజీ సీఎం కేసీఆరే గోల్కొండపై జెండా ఎగురవేసేవారు. కాగా.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తొలిసారి జెండా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి

మిగతా 2లో...



## వరుసగా 11వ సారి ప్రధానిగా మోదీ

న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : భారత ప్రధానిగా ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. దీంతో వరుసగా మూడు సార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రికార్డును ప్రధాని మోదీ సమం చేశారు.

మిగతా 2లో...



## కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం


### – తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో 31 ఏండ్ల ట్రైనీ డాక్టర్‌పై ఆస్పత్రి ప్రాంగణంలో హత్యాచారం జరిగినట్లు ఆరోపణలు రావడం దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బాధితురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు సానుభూతి తెలిపారు. ఇది భరించాల్సిన అంశం కాదని, మరీ ఇంత క్రూరత్వానికి ఒడిగట్టిన వారెవరినీ వదిలిపెట్టకూడదని ఎక్స్ వేదిగా డిమాండ్ చేశారు. మమతా బెనర్జీ ప్రభుత్వం నేరస్తుడిని పట్టుకోవడంతోపాటు బాధితులకు న్యాయం చేస్తుందని విశ్వసిస్తున్నానని చెప్పారు. ఈ ఘటనపై నిరసన తెలుపుతున్న వైద్యులకు సంఘీభావం ప్రకటించారు. దవాఖానలో వైద్యులు సురక్షితంగా ఉండలేకపోతే, మన ఆడపిల్లలు ఎక్కడైనా క్షేమంగా ఉంటారా అని ప్రశ్నించారు. కాగా, కోల్‌కతాలో ఆర్జీ కర్ కాలేజీలో 28 ఏండ్ల

మిగతా 2లో...

## కెసిఆర్ సంకల్పంతోనే సీతారామ పూర్తి

- కాంగ్రెస్ 7 నెలల్లోనే ప్రాజెక్ట్ పూర్తి చేసినట్లు బిల్డప్
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు




హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : సీతారామ ఎత్తిపోతల పథకం కేసీఆర్‌కు ఇష్టమైన ప్రాజెక్టు అని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు కరవు బాధలు తీర్చాలని సీతారామ ప్రాజెక్టు కోసం సంకల్పం చేసింది కేసీఆర్ అని అన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా దాన్ని నిర్మించాలను కున్నారని చెప్పారు. '8 నెలల్లో సీతారామ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందా? కాంగ్రెస్ నేతలు పరాన్న జీవులుగా ప్రవర్తిస్తున్నారు. వారి ప్రవర్తనతో ప్రజలు నవ్వుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు పోటీపడి పర్యటనలు చేస్తున్నారు. మేము ఇచ్చిన ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకొంటు న్నారు. మేము చేసిన ప్రతి మంచి పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని చెప్పుకొంటున్నారు. కేసీఆర్ కాకుండా సీతారామ ప్రాజెక్టును వేరేవారు రూపకల్పన చేసి ఉంటే అంత బాగా ఉండేదా? కాంగ్రెస్ పాలనలో ఖమ్మం జిల్లాకు చుక్క నీరు కూడా ఇవ్వలేదు. కానీ, కేసీఆర్ ఈ జిల్లాలో రెండు పంటలు పండే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేశారు. వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆలోచన చేశారు. 8 ప్యాకేజీల్లో 5 భారాస ప్రభుత్వం చేసిందే. మరో 3 ప్యాకేజీల్లో 80 శాతం పనులు మేమే పూర్తి చేశాం' అని హరీశ్‌రావు తెలిపారు.

## సుప్రీంలో కవితకు దక్కని ఊరట



- మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ
- ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ
- విచారణ ఆగస్ట్ 20కి వాయిదా వేసిన దర్మాసనం

న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : సుప్రీంకోర్టులో కవితకు ఊరట దక్కలేదు. ఆమెకు మధ్యతంర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం

2లో

## రాజ్ తరుణ్– లావణ్య కేసులో బిగ్ అప్డేట్

## కీలక వ్యక్తి అరెస్ట్




హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన టాలీవుడ్ హీరో

2లో



## హిందువులకు క్షమాపణ చెప్పిన బంగ్లాదేశ్ హెూం మంత్రి


ఢాకా, తెలంగాణ ముచ్చట్లు : బంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్లు, హింసాకాండలో హిందువులకు తగినంత భద్రత కల్పించలేక పోవడంపై ఆ దేశ హెూం మంత్రి షెకావత్ హుస్సేన్ క్షమాపణ చెప్పారు. హిందూ మైనారిటీని రక్షించే బాధ్యత మెజారిటీ ముస్లింలపై ఉందని అన్నారు. మునుముందు హిందువుల భద్రతకు, పరిస్థితులను మెరుగుపరచేందుకు తాము భరోసాగా నిలుస్తామని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం అధికారంలోకి ఉన్న మధ్యంతర ప్రభుత్వానికి షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్ పార్టీని నిషేధించే ఆలోచన ఏదీ లేదని షెకావత్ తెలిపారు. బంగ్లాదేశ్‌కు ఆ పార్టీ ఎంతో చేసిందని, ఆ విషయా న్ని తాము గుర్తించామని తెలిపారు. సమయం వచ్చినప్పుడు వారు కూడా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని చెప్పారు.

పోలీసు సమ్మె విరమణ

కాగా, పలు డిమాండ్లపై సమ్మెకు దిగిన బంగ్లా పోలీసులు ఎట్టకేలకు సమ్మె ఉపసంహరణకు

మిగతా 2లో

## మెడికో హంతకులను వదిలేది లేదు



- ఎంతటి వారున్నా శిక్షించి తీరుతాం
- అవసరమైతే కేసు సిబిఐకి అప్పగిస్తా
- కుటుంబ సభ్యులను పరామర్శించిన సిఎం మమత

కోల్‌కతా, తెలంగాణ ముచ్చట్లు : పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ మెడికో మర్డర్ పై ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సోమవారం ఉదయం మృతురాలి ఇంటికెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించిన మమత.. కేసును వారం రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఆగస్టు 18 నాటికి పోలీసులు దర్యాప్తు పూర్తి చేయకపోతే సీబీఐకి అప్పగిస్తామని తెలిపారు. కేసులో ఎంతమంది నింది తులున్నా.. వారందరినీ ఆదివారంలోగా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ కేసు విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పక్షా ల నుంచి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆమె పోలీసులకు డెడ్ లైన్ విధించారు. మరో వైపు మెడికో మర్డర్ పై ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. ఖీఉ కర్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సందీప్ ఘోష్ తన పోస్టుకు రిజైన్ చేశారు. అటు దేశ వ్యాప్తంగా పలు రకాల వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. హాస్పిటల్స్ జూనియర్ డాక్టర్ల భద్రతకు కేంద్రం ప్రోటోకాల్ రిలీజ్ చేయాలని ఫోర్డా డిమాండ్ చేసింది. అటు బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఫోర్డా స్పష్టం చేసింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
మంగళవారం 13 -08- 2024


# సంపాదకీయం

## యువతరాన్ని భ్రమల వాతావరణంలోకి నెడుతున్నారు

మూడు ప్రశ్నలు

యువ రచయితలపై సాహితీ పెద్దలు చాదస్తాన్ని రుద్దుతు న్నారు అన్న అర్థంలో ఈమధ్య మీరు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ రాశారు. ఏమిటి మీ దృష్టిలో ఈ చాదస్తం?

ఆ మాట అనటానికి కారణం వాళ్లింకా 50,- 60ల్లోనే బతుకుతున్నారని నాకనిపించటం. ఎందుకంటే- మొదటగా వాళ్ళ కాలంలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు వంటి రచయితలు గొప్ప రచయితలుగా పేరు సంపాదించేశారు. వాళ్ళ టైమ్‌కి అందరి నోళ్లలో నానుతూ ఉన్నారు. దానివల్ల ఇప్పటి పెద్దవాళ్ళు అయిన అప్పటి పిల్లలు వాళ్ళనే చదివి తరించి వాళ్ళ జాడ్యం లోనే ఉన్నారు. ఆ జాడ్యం అంటువ్యాధిలా ఇప్పటి తరానికి కూడా అందిస్తున్నారు.

ఇప్పటి తరం ముఖ్యంగా ఎదుర్కొంటున్న విమర్శల్లో ఒకటి వాళ్ళు గత సాహిత్యాన్ని చదవటం లేదూ అన్నది. కానీ ఇప్పటి తరం ఏ గత సాహిత్యాన్ని చదవటం లేదనీ వీళ్ళ బాధ? వీళ్ళు ఎవరినైతే ఆరాధించారో వాళ్ళని ఈ తరం ఆరాధించటం లేదని. తర తరానికి సాహిత్య పద్ధతులు మారతాయి. ఆలోచనలు మారతాయి. వీళ్ళ మనసులో ఉన్న అసలు ఉద్దేశం ఏమిటంటే వీళ్ళ పుస్తకాలు చదివి, వీళ్ళని గురువులుగా భావించాలి అని. ఇంకప్పుడు సాహిత్యం మిగలదు. గురు శిష్యుల కోలాటం మాత్రమే ఉంటుంది. కొత్త తరం విమర్శ తీసుకోదూ అనే ఇంకో మాటను వింటూ ఉంటా. అసలు ముందు ఈ మాట వాడేవాళ్లు విమర్శ తీసుకుంటే కదా కొత్త తరం తీసుకునేదీ లేనిదీ!

ఇంకో సమస్య శైలీ, శిల్పం అనేవాటి గురించి. ఈ శైలీ, శిల్పం అంటే ఏమిటి? వల్లంపాటి కథాశిల్పం పుస్తకాన్ని ఫాలో కావటమా? లేకపోతే కథలు ఎలా రాస్తారనే ఇతర విశ్లేషణా పుస్తకాలని ఫాలో కావటమా? నేను ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ రాసిన 'రచయితా- శిల్పమూ' అనే పుస్తకమూ, రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల - ప్రజలు' అనే పుస్తకాలు చదివాను. అందులో రష్యన్, యూరోపియన్ సాహిత్యం గురించి మంచి విమర్శ ఉంటుంది. ఇవి కదా మనం మాట్లాడాల్సింది.

"వీళ్ళ పుస్తకాలు చదివి వీళ్ళను గురువులుగా భావించలన్న" ఉద్దేశం... ఇలాంటి వాతావరణం నిజంగా ఉన్నదా?

ఉన్నది. వివిధ ప్రాంతాల నుంచి, వివిధ కులాల నుంచి కొత్తగా రచయితలు రావటం మనం చూస్తున్నాం. అయితే ఇప్పుడు ఉన్న మన వాతావరణం వాళ్ళకి తప్పుడు అభిప్రాయాలను ఎక్కిస్తున్నది: -'యువ పురస్కారం', లేకపోతే ఏదైనా అవార్డు, లేదా పెద్ద సంకలనాలలో రచన రావటం... ఇవే ముఖ్యమైన విషయాలన్న భ్రమ కల్పిస్తున్నది. కొత్త తరం ఇలాంటి వాటికి స్టక్ అయిపోయి- వీటిని పొందాలంటే ఎవరో ఒకరి ఆశ్రయం కావాలి కాబట్టి, అందుకోసం అప్పటికే సాహిత్యంలో స్థిరపడినవాళ్ళ దగ్గరకు వెళ్తున్నారు. వారేమో ప్రోత్సహిస్తున్నాం అన్న పేరుతో కొత్తగా రచన చేస్తున్నవారిని వాళ్ళ భజనపరులుగా మార్చుకుంటున్నారు. అందరూ ఇలా చేయకపోవచ్చు. కానీ జరుగుతున్నది ఇదే. పెద్దవాళ్ళకి వాళ్ళ రచనలు చదివి పొగిడేవాళ్ళు కావాలి. ఈ కాలంలో అంత తీరిక ఎవరికుంది. అందుకని గ్రామ్ ఫోన్ రికార్డు లాంటి కొత్త తరం కావాలి. నేనేం అనుకుంటానంటే- రచయిత మొదట స్వతంత్రుడు అయ్యాక సాహిత్యం రాయాలి.

శిల్పం, శైలి... వీటిపై మీ మాటల్లో వ్యతిరేకత ఎందుకు వ్యక్తమవుతుంది?

ఒక రచన గురించి మాట్లాడుతూ ఉన్నప్పుడు ఏ కొలతల్లో పాత్ర చిత్రీకరణ ఉండాలి, ఏ కొలతల్లో వాతావరణ చిత్రణ ఉండాలి అన్నట్లు శైలీ శిల్పాల గురించి ప్రస్తావిస్తేనే నాకు నచ్చదు. మనమేమన్నా తూనికరాళ్లతో వ్యాపారం చేస్తున్నామా? ఈ శైలి, శిల్పం అనే వాటిని అర్థం చేసుకోవటానికి చాలా పుస్తకాలు చదివాను. కానీ అదేదో మిథ్‌లాగా నాకిప్పటికీ వీటి వ్యవహారం బోధపడలేదు. నిజానికి కథ రాస్తున్నప్పుడు రచయిత మనసులో తను ఏ విషయం గురించి రాస్తున్నారో స్పష్టత ఉంటే చాలు. అది లేనప్పుడే ఈ గందరగోళం అంతా ఏర్పడుతుంది. నేనో వ్యక్తి గురించి రాసేటప్పుడు అతని జీవితం మొత్తం నాకు తెలిసిందై ఉండాలి. కాసేపు ఉండే పాత్రయినా... జీవితం నా చేతిలో ఉన్నాక కథ ఎలా ఏర్పడుతుందో తెలీకుండా ఉంటుందా!? శైలి, శిల్పం అనేవి పరిశోధక విద్యార్థులకీ, కథలు ఎలా రాయాలో నేర్పించాలి అనుకునేవాళ్లకీ అవసరం. రచయితకు కాదు.

## హిందువులకు క్షమాపణ చెప్పిన బంగ్లాదేశ్ హోం మంత్రి

అంగీకరించారు. తాత్కాలిక ప్రభుత్వ హోం వ్యవహారాల అడ్వయిజర్ హుస్సేన్‌తో ఆదివారంనాడు సమావేశమైన అనంతరం సమ్మె విరమిస్తున్నట్టు వారు ప్రకటించారు. 11 డిమాండ్లలో మెజారిటీ డిమాండ్ల పరిష్కారానికి హామీ లభించినట్టు పోలీసులు ధ్రువీకరించారు. దీంతో నిరసనలకు దిగిన నాన్-క్యాడర్ పోలీసు అధికారులు సోమవారం నుంచి విధులకు హాజరవుతున్నారు.

## పంద్రాగస్ట్ వేడుకలకు గోల్కొండకోట ముస్తాబు

ఫలాలు వివరిస్తూనే.. గత బీఆర్ఎస్ సర్కార్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రసంగం సాగనుంది. ముఖ్యమంత్రి సహా, ప్రముఖులు గోల్కొండ కోటకు తరలిరానుండటంతో ఏర్పాట్లను సీఎస్ శాంతకుమారి సోమవారం పరిశీలించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి గోల్కొండలో ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. వర్షం కురిస్తే.. వేడుకలకు హాజరయ్యేవారు తడవకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. వీఐపీలు రానున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు, పార్కింగ్ పై దృష్టి సారించాలని పోలీసులను ఆమె ఆదేశించారు. కాగా.. ఈ స్వాతంత్ర్య వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఓ వైపు సీఎస్ ఆదేశాలతో అధికారులు పరుగులు పెడుతుంటే.. అదే స్థాయిలో గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం గోల్కొండలో స్వాతంత్య దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. జెండా వందనం చేసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు రానున్న నేపథ్యంలో అనేక భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖుల ముందు నిర్వహించే పరేడ్‌కి సంబంధించి రిహార్సల్స్ కూడా జరుగుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు, ఈ పరేడ్ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

## సుప్రీంలో కవితకు దక్కని ఊరట

తిరస్కరించింది. ఆమె బెయిల్ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టు పెద్ద ట్విస్ట్ ఇచ్చింది. ఈడీ, సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. స్పందన తెలియజేయాలని కేంద్ర ఏజెన్సీలను కోర్టు కోరింది. తదుపరి విచారణను ఆగస్టు 20కి వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసుపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథ్ ధర్మాసనం విచారణ జరిపింది.సీబీఐ, ఈడీ కేసులలో బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు తీర్పును కవిత సవాల్ చేశారు. మార్చి 15న కవితను ఈడీ అరెస్టు చేయగా.. ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. ఇక కవిత తరుఫున న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. 5 నెలల నుంచి ఆమె జైల్లో ఉన్నారు. 463 మంది సాక్షులను విచారించామని ధర్మాసనం పేర్కొంది. కాగా ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే కవితకు ట్రయల్ కోర్టు, ఢిల్లీ హై కోర్టు బెయిల్ నిరాకరించాయి. దీంతో ఆమె ఆశలన్నీ సుప్రీంకోర్టు పైనే పెట్టుకున్నారు. ఇవాళ తనకు బెయిల్ వస్తుందని ఆమె భావించినట్టు సమాచారం. తనపై ఈడీ, సీబీఐలు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ కవిత ఈ నెల 8న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు జూలై 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(క్రిమినల్) దాఖలు చేశారు. అక్కడ కూడా వాయిదా పడింది. ఇక బెయిల్ కోసం మరో వారం పాటు కవిత వేచిచూ?డాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడైనా బెయిల్ వస్తుందో రాదో వేచిచూడాల్సి ఉంది. ప్రస్తుతం కవిత తీహార్ జైల్లో ఉన్నారు. ఆమెను బయటకు తీసుకొచ్చేందుకు ఆమె కుటుంబం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఇటీవలే ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వారిద్దరూ కవితకు బెయిల్ అంశంపై చర్చించారని జోరుగా ప్రచారం సాగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ కోర్టులో నిరాశే ఎదురవ్వడం గమనార్హం.ఢిల్లీ హైకోర్టులో ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సంస్థలు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌లో 50 మందిని నిందితులుగా పేర్కొన్నాయని... అందులో కవిత మాత్రమే మహిళ అని ఆమె తరుఫు సీనియర్ న్యాయవాదులు గతంలో ఢిల్లీ హైకోర్టులో వాదించారు. మహిళలకు కొన్ని ప్రత్యేక వెసులుబాట్లను చట్టాలు కల్పించాయని తెలిపారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కవితకు బెయిల్ ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థల తీరును ఆమె తరుపు న్యాయవాది తప్పుబట్టారు. కవిత విషయంలో దర్యాప్తు సంస్థలు మొదటి నుంచీ చట్టాలను ఉల్లంఘిస్తూనే ఉన్నాయని.. అరెస్టు సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని.. మహిళలకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయని వాటి కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు వినిపించిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

## వరుసగా 11వ సారి ప్రధానిగా మోదీ

ఇక ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా 11 సార్లు ఎర్రకోటపై నుంచి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. జాతినుద్దేశించి ప్రసంగించిన మూడో ప్రధానిగా చరిత్రలో నిలిచిపోనున్నారు.

ఆ ఇద్దరి తర్వాత మోదీ..

ఇప్పటి వరకు వరుసగా 11 సార్లు ఎర్రకోటపై నుంచి ప్రసంగించిన ప్రధానుల్లో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ఉన్నారు. గురువారం జరగనున్న భారత స్వాతంత్ర్య వేడుకలకు దేశ రాజధానిలోని ఎర్రకోట ముస్తాబవుతుంది. ఆ రోజు ప్రధాని నరేంద్ర మోదీ.. ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. దీంతో వారి సరసన ప్రధానిగా మోదీ చేరనున్నారు. భారత తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ వరుసగా 17 సార్లు ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. అలాగే ఆయన కుమార్తె, ఇందిరాగాంధీ మొత్తం 16 సార్లు ఎర్రకోటపై నుంచి ప్రధానిగా జాతినుద్దేశించి మాట్లాడారు. 1966 జనవరి నుంచి 1977 మార్చి వరకు వరుసగా 11 సార్లు ఆమె ఎర్రకోటపై నుంచి ప్రధానిగా ప్రసంగించారు. అలాగే 1980 జనవరి నుంచి 1984 అక్టోబర్ వరకు ప్రధానిగా మరోమారు అదే ఎర్రకోటపై నుంచి ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు.

ప్రధానిగా మన్మోహన్ సింగ్..

ఇక యూపీఏ హయాంలో ప్రధానిగా మనోహ్మన్ సింగ్ పని చేశారు. ఆయన సైతం వరుసగా 10 సార్లు మాత్రమే ఆగస్ట్ 15వ తేదీన ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. దీంతో ప్రధానిగా తొలిసారి నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. అదే ఏడాది ఆగస్ట్ 15వ తేదీన ఎర్రకోటపై నుంచి ప్రధానిగా ఆయన జాతినుద్దేశించి తొలిసారిగా ప్రసంగించారు. ఈ ప్రసంగంలోనే స్వచ్ఛ్ భారత్‌తోపాటు జనధన్ యోజన ఖాతాలను ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోదీ కీలక ప్రకటన చేసిన విషయం విధితమే.

సరాసరి 82 నిమిషాలు ప్రసంగం

ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ.. ప్రధాని మోదీ ప్రసంగ పాఠం సరాసరి 82 నిమిషాలుగా ఉంది. 2017లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రసంగం పాఠం కేవలం 55 నిమిషాలు మాత్రమే ఉండగా.. 2016లో ఆయన ప్రసంగ పాఠం మొత్తం 94 నిమిషాలుగా ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వేళ.. అంటే 1947లో ప్రధానిగా నెహ్రూ కేవలం 24 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇక 1972లో ప్రధాని ఇందిరా గాంధీ 54 నిమిషాలు ప్రసంగించారు.

## కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం

ట్రైనీ డాక్టర్ హత్యకు గురయ్యారు. శుక్రవారం రాత్రి అర్ధనగ్న స్థితిలో బాధితురాలి మృతదేహం లభ్యమైంది. ఆమెపై లైంగికదాడి జరిగినట్టు నిర్ధారణ అయింది. నిందితుడు సంజయ్‌రాయ్‌ని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. శుక్రవారం రాత్రి అతడి విరిగిన ఇయర్ ఫోన్ వైద్యురాలి హత్య జరిగిన సెమినార్ రూమ్‌లో దొరికింది. అదే అతడిని పట్టించింది.

ఆ రోజు తెల్లవారు జామున 4 గంటలకు ఎమ్మర్జెన్సీ భవనంలోకి వెళ్తున్నప్పుడు బ్లూటూత్ డివైజ్ అతని మెడలో ఉంది.40 నిముషాల అనంతరం బయటకు వచ్చేటప్పుడు అది అతడి మెడలో లేదు. కొంతసేపు పెనుగులాట తర్వాత డాక్టర్‌ను గొంతు పిసికి చంపినట్టు నిందితుడు అంగీకరించాడని పోలీసులు చెప్పారు. ఆ సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడన్నారు. సంజయ్ రాయ్‌కు ఇదివరకే నాలుగుసార్లు పెండ్లిండ్లు అయ్యాయి.

అయితే అతని ప్రవర్తన కారణంగా ముగ్గురు భార్యలు అతడిని వదిలి వెళ్లిపోగా. నాలుగో భార్య గత ఏడాది మరణించింది. సంజయ్ రాయ్ పోలీస్ పౌర వాలంటీర్‌గా పనిచేస్తున్నాడు.

## రాజ్ తరుణ్- లావణ్య కేసులో బిగ్ అప్డేట్.. కీలక వ్యక్తి అరెస్ట్

రాజ్ తరుణ్- లావణ్య కేసులో రోజుకో మలుపు తరిగింది. రోజుకో కొత్త విషయం.. పూటకో ట్విస్ట్‌గా సాగుతున్న ఈ ఎపిసోడ్‌లో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంటోంది. ఈ కేసులో ఎక్కువగా వినిపించిన పేరు మస్తాన్ సాయి. ఇతను డ్రగ్ పెడ్లర్‌గా వ్యవహరిస్తూ.. పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఓపై లావణ్య కేసు.. మరోవైపు వరలక్ష్మి టిఫిన్స్ డ్రగ్స్ కేసులో మస్తాన్ పేరు మార్మోగింది. ఈ క్రమంలోనే నిందితుడిని గాలించిన ఏపీ పోలీసులు సోమవారం నాడు గుంటూరు జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు.

## ఇంటి దగ్గరికే సీఎంఆర్ఎఫ్ చెక్కులు

### -హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి నియోజకవర్గం లో పెద్దమందడి గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వనపర్తి ఎమ్మెల్యే తుడీ మేఘా రెడ్డి ఆదేశాను ప్రకారం సీఎం రిలీఫ్ ఫండ్ బాధితుల ఇంటి దగ్గరికి వెళ్లి కాంగ్రెస్ కార్యకర్తలు ఇవ్వడం జరిగింది. మోత్కల వీరేందర్ కు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి గారు సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్ గారు పుల్లన్న యాదవ్, టైలర్ రవి , కురుమూర్తి, టిఎంఆర్ నాయకులు ఎస్ రాఘవేందర్, గట్టు రాజశేఖర్, రామంజి , ఉషన్న , బోయ స్వామి, నీలం రవి ,మేస్త్రి కృష్ణయ్య , జావేద్ దుబ్బ కృష్ణయ్య, సూర వెంకటస్వామి, చిన్న మన్నెం, హనుమంతు, సాయిబాబా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## స్మశాన వాటిక లేక అవస్థలు పడుతున్న గ్రామస్తులు

### - అధికారులు,నాయకుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదు - మహమ్మదాపూర్ గ్రామ దళితులు





**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా పానుగల్ మండలంలోని మహమ్మదాపూర్ గ్రామంలో ఎస్సీ మహాదిగలకు స్మశాన వాటిక లేక చాలా సంవత్సరాల నుండి తీవ్రమైన అవస్థలు పడుతూ సమస్యను ఎదుర్కొంటున్నారు.కాలనీలో ఎవరు మరణించిన స్మశాన వాటిక వెళ్లే దారి సరిగా లేకపోవడం వల్ల తాత్కాలికమైన రోడ్డు మార్గాన్ని సరిచేసుకుంటూ దహన కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నారు,ప్రతి సందర్భంలో ఈ విధంగానే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇట్టి విషయంపై అనేకసార్లు అధికారులకు విజ్ఞాపన పత్రాలు అందించిన స్పందించలేదు. ఇకపై అయినా ఇట్టి విషయాన్ని పరిష్కరించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని,ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంఖుస్థాపన





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాలేరు నియోజకవర్గంలో సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా ఖమ్మం రూరల్ మండలం ఆరెకోడు, ఆరెకోడు తండాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే తల్లంపాడు నుంచి పైనంపల్లి వరకు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులకు తల్లంపాడు వద్ద శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం ను కలిసిన డిఎస్ మహేష్



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా మదనాపురం లో ఆదివారం జరిగిన మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగారి ప్రీతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దళిత నాయకులు డి ఎస్ మహేష్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ నిధుల గురించి ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు మహేష్ తెలిపారు.వనపర్తి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గంధం రాజశేఖర్, మాజీ అధ్యక్షులు కొంకి వెంకటేష్, జిల్లా మాదిగ జేఏసీ అధ్యక్షులు కిరణ్, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది, గంధం ,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో విద్యుత్ కోతలు

## - పులికల్ దళితవాడే ఇందుకు నిదర్శనం

## - ఎక్స్‌లో పోస్ట్ చేసిన కెటిఆర్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్రంలో విద్యుత్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రోజుల తరబడి కరెంట్ ఉండడం లేదు. తెలంగాణలో కరెంట్ కోతల్లేవని, అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. అయితే కరెంట్ కోతలపై ప్రభుత్వం అబద్దాలాడుతోంది అనడానికి ఈ ఘటనే నిదర్శనం అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని అయిజ మండలం పులికల్ గ్రామంలోని దళిత వాడలో గత వారం రోజులుగా కరెంట్ లేదు. దళిత కుటుంబాలన్నీ చీకట్లోనే ఉంటున్నాయి. గ్రామంలోని ఇతర బీసీ కాలనీల్లో కరెంట్ ఉన్నప్పటికీ, దళిత వాడలో మాత్రం కరెంట్ లేదు. విషయంపై కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# బౌద్ధ స్థూపాన్ని ప్రఖ్యాత పర్యాటక కేంద్రంగా మారుద్దాం

## - ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి

## - డిప్యూటీ సీఎం, మంత్రులతో కలిసి పరిశీలన





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** క్రీ.శ. ఒకటో శతాబ్ద కాలానికి చెందిన నేలకొండపల్లి వద్ద గల బౌద్ధ క్షేత్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుదామని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ముజమ్మీల్ ఖాన్, సీపీ సునీల్ దత్ తో కలిసి బౌద్ధ స్తూపం చుట్టూ తిరిగి..అక్కడి పరిసరాల్లో కలియ తిరిగి పరిశీలించారు. ఆర్కియాలజీ డిప్యూటీ డైరెక్టర్, అధికారుల ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నారు. పర్యాటకులను, బౌద్ధ భిక్షువులను ఆకట్టుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని, అందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సి ఉందని అన్నారు. ఇక్కడి స్థూపం దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దది కావడం విశేషమని, శతాబ్దాల చరిత్ర కలిగిన దీని ఆనవాళ్లు పదిలంగా ఉండేలా పనులకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ క్షేత్రం వెంట ఉన్న చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసి.. సందర్శకులు, పర్యాటకులను ఆకట్టుకోవచ్చని అన్నారు. ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులు, ఎంపీ స్వయంగా ఈ ప్రాంతానికి వచ్చి.. పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తామని అభయం ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

**భక్త రామదాసు గృహ సందర్శన**

తెలుగు వాగ్గేయకార ఆద్యులు, భద్రాచల శ్రీ సీతారామ దేవస్థానం నిర్మించిన భక్త రామదాసు(కంచర్ల గోపన్న) నాలుగు శతాబ్దాల కిందట జీవించిన నేలకొండపల్లిలోని ఆయన స్వగృహాన్ని, పక్కనే నిర్మాణంలో ఉన్న నూతన ధ్యాన మందిరాన్ని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు లతో కలిసి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. భక్త రామదాసు వినియోగించిన బావిని స్వయంగా పరిశీలించారు. అప్పటి విశేషాలను అర్చకులు, స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో.. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, కొప్పుల చంద్రశేఖర్ రావు, వెన్నపూసల సీతారాములు, బొడ్డు బొందయ్య, నాగేశ్వరరావు, చిత్తూరి అచ్చయ్య, మామిడి వెంకన్న, వేగినీటి లక్ష్మీ నరసయ్య, బచ్చలకూరి నాగరాజు, మైసా శంకర్, షేక్ మదర్ సాహెబ్, అంజిని, బోయిన వేణు, సీత, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ముఖ్యమంత్రి పర్యటనను పటిష్ట కార్యాచరణతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రాద్రి జిల్లాలో లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తర్వాత వైరాలో 50 వేల మంది రైతులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, వారికి కేటాయించిన విధులను మనసుపెట్టి నిర్వర్తించాలన్నారు. ఈ నెల 14న సీనియర్ అధికారులు, మంత్రులు జిల్లాకు రానున్నట్లు, వసతి ఏర్పాట్లలో లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆగస్టు 15న కలెక్టరేట్, పెరేడ్ గ్రౌండ్స్ లో పతాక ఆవిష్కరణ పిదప, సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానం ఉంటుందని, ఉదయం 11.30 గంటలకల్లా విధులు కేటాయించిన అధికారులు వైరా సభాస్థలి చేరుకోవాలన్నారు. స్టేజ్ పై ఏర్పాట్లు, ప్రోటోకాల్ ఖచ్చితంగా పాటించడం చేయాలన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖలకు డెకరేషన్ బాధ్యతలు అప్పగించామన్నారు. 200 మందితో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8 ఎంక్లోజర్లు వుంటాయని, క్రౌడ్ మేనేజ్మెంట్ చాలా ముఖ్యమని అన్నారు. 4 చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ప్రవేశం, నిష్క్రమణ లపై అవగాహన కల్గివుండాలన్నారు. 3 గ్రీన్ రూమ్ లకు బాధ్యులను కేటాయించాలన్నారు. అగ్నిమాపక అధికారులు ఫైర్ ఇంజన్, అగ్నిమాపక పరికరాలతో అందుబాటులో వుండాలన్నారు. జనరేటర్లు అందుబాటులో ఉంచాలని, అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఉండాలని ఆయన తెలిపారు. బారికేడ్లు, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్య శిబిరాలను హెలీప్యాడ్, సభాస్థలిలో ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. అధికారులు సమన్వయంతో, ఎక్కడ తప్పిదాలకితావివ్వకుండా పర్యటన సాఫీగా జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఖమ్మం ఖిల్లా ను పరిశీలించిన ఎంపీ రఘురాంరెడ్డి

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న చారిత్రక ఖిల్లా ను ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి సోమవారం పరిశీలించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ఖిల్లాను ఎక్కారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఖిల్లా పైకి రోప్ వే ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని ప్రకటించారు. ఇది పూర్తయితే.. రాష్ట్రంలో మంచి పర్యాటక కేంద్రం గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఖిల్లా పైన కలియతిరిగి.. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పర్యాటకులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మంత్రులు, ఎంపీ చర్చించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెట్టుబడులే లక్ష్యంగా సిఎం రేవంత్ పర్యటన

## బిఆర్ఎస్ దుష్ప్రచారాలపై ఎంపి చామల మండిపాటు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా విదేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. అమెరికా పర్యటన ముగిసి దక్షిణ కొరియాకు సీఎం రేవంత్ బృందం వెళ్లిందని చెప్పారు. ఇప్పటివరకు రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పలు కంపెనీలు ముందుకొచ్చాయని అన్నారు. ఐటీ, ఫార్మా, ఏఐ కంపెనీలతోపాటు మరికొన్ని కంపెనీలు ఇన్వెస్ట్ చేయడానికి అగీకరించాయని చెప్పారు. 8 నెలల్లో రెండు సార్లు విదేశీ పర్యటనలు జరిగాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు అందరికీ తెలుసునని చెప్పారు. చెప్పినట్టుగా సీఎం రేవంత్ రైతు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. అయితే బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ సర్కార్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ విదేశీ పర్యటనపై కూడా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము తప్పులు చేస్తే నిలదీయండి కానీ బురద జల్లవద్దని హితవు పలికారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పదేళ్లు కుటుంబ పాలన సాగిందని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. వారే అన్ని పదవులు పొందారని అన్నారు. జాబ్ క్యాలెండర్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనని తెలిపారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో సోషల్ మీడియాను పెంచి పోషిస్తున్నారని విమర్శలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ బంధువులైన తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వస్తే స్వాగతిస్తామని అన్నారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని సూచించారు. పదేళ్లు చేయనిది.. 8 నెలల్లోనే చేయాలని ప్రశ్నించారు. కొంత సమయం ఇస్తే అన్ని పూర్తి చేస్తామని వివరించారు. ఘాళేశ్వరం, సుంకిశాల కూలడానికి తామే కారణం కాదని .. సుంకిశాల తప్పిదం బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీలు 8 మంది ఉన్నారు. కాంగ్రెస్ ఎంపీలు కూడా 8 మంది ఉన్నామని అందరం కలిసి కేంద్రం నుంచి తెలంగాణకు అభివృద్ధి కోసం నిధులను తెచ్చుకుందామని చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
మంగళవారం 13 -08- 2024



# నిద్రలేచింది మొదలు... పనిలో నిమగ్నమవ్వాలి

### - ఏ గ్రామ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండాలి
### - వ్యవసాయశాఖ ఏఈవోలకూ ఇదే వర్తిస్తుంది
### - వచ్చే సోమవారం నాటికి ఇది అమలుకావాలి
### - గ్రామ కార్యదర్శులపై ఎంపీడీవోల పర్యవేక్షణ తప్పనిసరి



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** నిద్రలేచింది మొదలు... పనిలో నిమ్నగమవ్వాలి.. ఏ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసం ఉండి పనిచేయాలి... అప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలు... స్థానిక స్థితిగతులపై పట్టుకలిగి ఉంటారు... పాలేరు నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పలు పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదుల అందాయి... మొదటి తప్పుగా మందలించి వదిలేయడం జరుగుతుంది. ఇదే పునరావృతం అయితే ఊరుకునేది లేదు... వారికి ట్రాన్స్ ఫర్ అనేది ఉండదు... శాఖాపరమైన చర్యలకు పూనుకోవాల్సి ఉంటుందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గ్రామ కార్యదర్శులను హెచ్చరించారు. అలాగే వ్యవసాయ శాఖ ఏఈవోలు కూడా వారు పనిచేసే క్లస్టర్ పరిధిలోనే నివాసం ఉండాలని సూచించారు. ఓ గ్రామంలో నివాసం ఉంటూ మరో గ్రామంలో లేదా వేరే మండలం నుంచి ఇంకో మండలంలోని ఏదైనా గ్రామంలో పనిచేసే వారు తక్షణమే వారు పనిచేసే గ్రామాలకు నివాసం వెళ్లాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా ఇది అమలు కావాలని డీపీవోకు సూచించారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఖరీఫ్ పంటల సాగు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత నియోజకవర్గంలోని మేజర్ గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శుల నుంచి ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశ అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.... ప్రతి గ్రామ పంచాయతీల్లో డైనమిక్ గా పనిచేసే కార్యదర్శులను నియమించాలన్నారు. ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా లాంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో అవసరాన్ని బట్టి మరో పంచాయతీ కార్యదర్శిని కూడా నియమించాలని సూచించారు. రాబోవు ఏడాదిలోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల సమస్య తీరుతుందని... అత్యవసరమైనవి తన దృష్టికి తెస్తే తక్షణమే నిర్మాణం చేపట్టేలా చూస్తానని పేర్కొన్నారు. పలువురు సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి పాఠశాలలకు 200మీటర్ల లోపు కూడా మద్యం దుకాణాలకు అనుమతి ఇచ్చారని వాటి వివరాలను సేకరించి వారిపై చర్యలకు ఉపక్రమించాలని సంబంధిత అధికారులనుఆదేశించారు.

**- ప్రజలను వేధిస్తే.... టార్గెట్ చేస్తా...**

ఎవరి పని వారు చేసుకుంటూ పోతే ఎవరిని మందలించనని... కానీ ఏదైనా పనికోసం ప్రజలు ఆయా గ్రామల్లో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది దగ్గరికి వచ్చినప్పుడు వారికి ఆ పనిచేయకుండా వారి దగ్గర ఏదైనా ఆశించి ఇబ్బందులకు గురిచేసినట్లు తన దృష్టికి వస్తే ఆ సిబ్బందిని కానీ ఆ అధికారిని కానీ ఖచ్చితంగా టార్గెట్ చేస్తానని హెచ్చరించారు. ఆయా గ్రామపంచాయతీ పరిధిలో వికలాంగుల, వృద్ధాప్య, వితంతు మొదలగు పెన్షన్ కు అర్హులైన వారిని గుర్తించాలని, అనర్హులకు ఒకరికి కూడా పెన్షన్ ఇవ్వొద్దని అన్నారు. అర్హులకు ఎంతమందికి ఇవ్వడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని.... పొరపాటున ఒక అనర్హుడికి ఇచ్చినా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఆ అనర్హుడిని ఉదాహరిస్తూ అర్హత లేని వారు ఇంకెందరో పెన్షన్ తమకూ ఇవ్వాలని ఇబ్బందులకు గురిచేస్తారన్నారు. కావున వాటి మీద దృష్టి సారించాలని కార్యదర్శులకు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అంగన్ వాడీలు, ఆశావర్కర్లను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలోనూ తన సొంత ఖర్చుతో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానని త్వరలోనే అవి పూర్తవుతాయని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడుతూ.... రైతు రుణమాఫీ ఎంతమందికి అందింది... ఇంకెంతమందికి అందాలనే జాబితాను రూపొందించాలన్నారు. అందనివారికి ఏ రిమార్క్ కింద అందలేదో అనేది కూడా చెప్పాలన్నారు. పామాయిల్ సాగు, ఖరీఫ్ పంటలపై దృష్టిసారించాలని సూచించారు. రైతు వేదికల వద్ద రైతు సోదరులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీపీవో, డీఎల్ పీవో, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, ఇతర శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని, అక్రమాలపై ప్రజావాణిలో వినతి పత్రం

### - అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి మున్సిపాలిటీలో ప్రజలు కట్టిన పన్నులు జనరల్ ఫండ్ గా జామ చేస్తారు. కానీ అలాంటి జనరల్ ఫండ్ త్రాగునీటి అవసరాలకు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాలి. కానీ వనపర్తి మున్సిపాలిలో జనరల్ ఫండ్ దారి మల్లుతుందని గుర్తించిన ఐక్యవేదిక ఈరోజు జిల్లా కలెక్టర్ గారికి పలు అంశాలు గుర్తించిన వాటిపై ఫిర్యాదు చేయడం జరిగింది.

వాటిలో ఒకటి: మిషన్ భగీరథ నీరు సరఫరా చేసే ఆర్ డబ్ల్యు ఎస్ లో మున్సిపల్ సిబ్బంది పనిచేయడం. ప్రజా ప్రతినిధులు కమీషనర్ ఇళ్లల్లో మున్సిపల్ సిబ్బందిని వాడుకోవడం చట్టవిరుద్ధమని,

రెండవది : ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించిన ఇద్దరికీ 10 లక్షలు మున్సిపాలిటీ నుండి కేటాయించడం చట్ట ప్రకారం సరైనదా.

మూడవది : రామనుపాడు నుండి ప్రతిరోజూ నీరు సరఫరా అవుతున్నా ట్యాంకర్ల పేరుతో లక్షలు బిల్లులు చేసుకోవడం.

నాలుగవది : లీకేజీల పేరుతో 15 ఫైనాన్స్ నుండి లక్షలకు లక్షలు ఖర్చుపెట్టి సామాను తెప్పించి అవి ఉండగానే మళ్లీ చీటీల పేరుతో పలు షాపుల్లో సామాను తెప్పించుకున్నట్లు బిల్లులు చేసుకోవడం.

ఐదవది: ప్రతిరోజు నీరు వస్తున్నా బోర్ల పేరుతో మోటర్ల పేరుతో లక్షల లక్షలు బిల్లులు చేసుకోవడం ఆర్ డబ్ల్యూ ఎస్ వారు మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా చేస్తున్నా మున్సిపాలిటీ నుండి అధిక మొత్తంలో బిల్లులు పెట్టడం వెనక అవినీతి ఉందనేది సత్యం కనుక వెంటనే విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని అఖిలపక్ష ఐక్య వేదిక డిమాండ్ చేస్తుంది.



ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్ తో పాటు టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, తీన్మార్ మల్లన్న సంఘం జిల్లా ప్రెసిడెంట్ విజయ్ యాదవ్, బీ.జే.వై.ఎం టౌన్ ప్రెసిడెంట్ రవి, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, బీసీ సంఘం నాయకులు గౌనికాడి యాదయ్య, నాయకులు బోడ్డుపల్లి సతీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# మేఘా అక్రమాలను ఎందుకు పట్టించుకోరు

### - కాంగ్రెస్ కూడా అదే సంస్థతో అంటకాగడమెందుకు బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రశ్న

హైదరాబాద్,ఆగస్ట్12: మేఘా కంపెనీ తెలంగాణలో 56 పనులు చేపడితే అందులో ఒక్కటీ పూర్తి కాలేదని, సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలితే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర ఆయన మీడియాతో మాట్లాడారు. పనుల్లో నాణ్యత లోపిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కాంట్రాక్టు సంస్థతో ఎందుకు పనులు చేయిస్తున్నదంటూ ప్రశ్నించారు.మేఘా సంస్థ కేరళలో చేసిన పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించలేదని కేంద్రం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని చెప్పారు. ఇంత జరుగుతున్నా ఆ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోటీసులు జారీ చేయడం లేదని ప్రశ్నించారు. మేఘా చేసిన పనులను ఎందుకు పబ్లిక్ డొమయిన్లో పెట్టడం లేదన్నారు. కూలిపోయిన కాళేశ్వరం, సుంకిశాల పనులను మేఘాతోనే మళ్లీ చేయించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, జార్ఖండ్ లలో త్వరలో జరగబోయే ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి మేఘా కంపెనీ నిధులు సమకూర్చుతోందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో ఉందని, గత బీఆర్ఎస్ సర్కారు అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి మళ్లీ 62 వేల కోట్ల అప్పు తెచ్చారని అన్నారు. సీఎం కాకముందు అవినీతి పై ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. ఆ తర్వాత ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్

### చేజారిన నకిరేకల్ మున్సిపాలిటీ

**నల్లగొండ, తెలంగాణ ముచ్చట్లు :** నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ పాగ వేసింది. నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా.. వారిలో 16 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా నిలిచారు. మిగిలిన నలుగురు సభ్యులు ఈ అవిశ్వాస తీర్మానానికి హాజరు కాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో నకరేకల్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. దీంతో నకిరేకల్ మున్సిపల్ పీఠం హస్తం పార్టీకి దక్కుతుంది. ఎమ్మెల్యే వేముల వీరేశం అవిశ్వాసంలో చక్రం తిప్పాడు. త్వరలోనే నకలిరేకల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్త చైర్మన్ ఎన్నిక కానుంది.

# దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు

### స్మితా సబర్వాల్‌పై చర్యలు కోరుతూ పిల్

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** దివ్యాంగులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు గానూ ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో పిల్ దాఖలైంది. సామాజికవేత్త వసుంధర పిటిషన్ దాఖలు చేశారు. స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని యూపీఎస్సీ చైర్మన్‌కు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో ఆమె కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారించింది. అయితే.. ఈ సందర్భంగా కోర్టు కొన్ని కీలక ప్రశ్నలు సంధించింది. పిటిషనర్‌కు ఉన్న అర్హతను హైకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్ ఒక వికలాంగులారని అడ్వకేట్ తెలిపారు. పూర్తి వివరాలతో అఫిడవిట్ సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. దివ్యాంగులు ఐఏఎస్‌లుగా పని చేయలేరంటూ అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని సీఎస్ బీ ఐఏఎస్ అకాడమీ చీఫ్, మాజీ ఐఏఎస్ మల్లవరపు బాలలత ఇటీవల డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న ఒక ఐఏఎస్ ఆఫీసర్ ఇలాంటి పోస్టు పెట్టడం దారుణమని, ఆమెపై సీఎం రేవంత్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమా లేక ప్రభుత్వ అభిప్రాయాలా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు తీర్పులను కూడా ఆమె వ్యతిరేకిస్తున్నారా? అన్నది చెప్పాలన్నారు. దివ్యాంగులు ఎక్కువ సేపు పని చేయలేరంటూ వారి సామర్థ్యాన్ని నిర్ణయించడానికి స్మితకు ఏం అధికారం ఉందని ప్రశ్నించారు. ఏ అంశాల ప్రాతిపదికగా ఆమె ఈ నిర్ణయానికి వచ్చిందో చెప్పాలన్నారు.'స్మితా సబర్వాల్ కు, నాకు సివిల్స్ ఎగ్జామ్ పెట్టండి. ఎవరికి ఎక్కువ మార్కులు వస్తాయో చూద్దాం' అని బాలలత ఓపెన్ చాలెంజ్ చేశారు. 'సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే తొలి ఉద్యోగం ఒక దివ్యాంగురాలికి ఇచ్చారు. ఆమె సామర్థ్యాన్ని చూసి ఇచ్చారా లేదంటే ఊరికే ఇచ్చారా అన్నది సీఎం స్పందించి తెలియజేయాల్సిన అవసరం ఉన్నది' అని ఆమె కోరారు.

# రేవంత్‌పై సోషల్ మీడియాలో కారుకూతలు

### - అమెరికా పర్యటనను తట్టుకోలేక పోతున్న బిజెపి
### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్న రేవంత్‌పై సోషల్ మీడియాలో కారుకూతలు కూస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అమెరికా పర్యటన విజయవంతం కావడం బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి అమెరికాకు సరికొత్త తెలంగాణను పరిచయం చేశారన్నారు. పెట్టబడులకు తెలంగాణను స్వర్గంగా మార్చుతున్నారని అన్నారు. సూటు బూటు వేసుకొని దావోస్ వెళ్లిన కేటీఆర్ ఎన్ని కంపెనీలను తెలంగాణకు తెచ్చారని ప్రశ్నించారు. కేటీఆర్ ఏంవోయూ కుదుర్చుకున్న కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయన్నారు. ఒప్పందం చేసుకున్న కంపెనీలకు గత ప్రభుత్వం సరైన వసతులు కల్పించలేదని విమర్శించారు. రేవంత్ సక్సెస్ తక్కువ చేసి చూపించేందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా కష్టపడుతోందని వ్యాఖ్యలు చేశారు. బుర్రలేని వాళ్ళు కేటీఆర్ రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారన్నారు. అంగుళం భూమి కేటాయించకముందే మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తప్పులు చేసి తీహార్ జైల్లో ఎవరున్నారో ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ పదేండ్ల సూటు బూటు హడావిడికి రేవంత్ కేవలం 8 నెలల్లోనే సమాధానం చెప్పారని అన్నారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు, మరోవైపు ప్రైవేట్ ఉద్యోగాల కల్పన చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారన్నారు.తెలంగాణ అభివృద్దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మూడు సార్లు దావోస్ పోయి కంపెనీలు తెచ్చానన్న కేటీఆర్ దానిలో ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 'విదేశీ పర్యటనల పేరుతో దుబాయి వెళ్లి సొంత బిల్డింగులు కొనుక్కున్న మీతో రేవంత్‌కుకి పోలికా?' అంటూ మండిపడ్డారు. కేటీఆర్ ఇచ్చిన స్క్రిప్ట్ చదివి దిగజారవద్దని బీఆర్ఎస్ నేతలకు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే పనిచేస్తే వారి పని ఖతం అవుతుందని బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు.

# అధికారులను సత్కరించిన టిడిపి నాయకులు సింగవరపు ప్రభాకర రావు

**గుడివాడ రూరల్, తెలంగాణ ముచ్చట్లు :** కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ కళింగ సాధికార కమిటీ అధ్యక్షుడు సింగవరపు ప్రభాకర్ రావు నందివాడ నూతన ఎస్సై శ్రీని వాసరావు , గుడివాడ రూరల్ సీఐ. సోమేశ్వరరావు , నంది వాడ ఎమ్మార్వో. రంగనాయక్ లను మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువతో సత్కరించి స్టేషన్ కు కావలసిన జెకె ఈజీ కాపీయర్ వైట్ పేపర్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి సింగవరపు బాబురావు కూడా పాల్గొన్నారు .

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# జిల్లాలో రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





మచిలీపట్నం,తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహణపై జిల్లా కలెక్టర్ సోమవారం రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్లో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 15 నుండి రెవిన్యూ సదస్సులు నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ సదస్సుల నిర్వహణలో ప్రభుత్వ విధివిధానాలు పాటించాలన్నారు. మొదట రీ సర్వే చేపట్టని గ్రామాల్లో, చిన్న గ్రామాల్లో, పెద్దగా భూ సమస్యలు లేని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. ఒక్కొక్క రెవిన్యూ సదస్సుకు మధ్యలో రెండు మూడు రోజుల గ్యాప్ ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి ముందుగా రెవిన్యూ టీములు గ్రామంలో పర్యటించి స్థానికంగా భూ సమస్యలు గుర్తించాలని, వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యల గురించి అవగాహన కల్పించుకోవాలని అన్నారు. గ్రామ సదస్సులు నిర్వహణలో వచ్చే సమస్యలను ముందుగా ఊహించి ఆలోచించి ఆయా సమస్యలకు ఎండార్స్మెంట్లు ఎలా ఇవ్వాలి ముందుగా స్టాండర్డ్ ఫార్మేట్ తయారు చేసుకోవాలని సూచించారు. అర్జీదారునికి అర్థమయ్యే రీతిలో తెలుగులో స్పష్టంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని, వారి సమస్య ఎన్ని రోజులకు పరిష్కారం అవుతుందో పేర్కొనాలని, ఈ విధానం చాలా సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. గ్రామాల్లో ముఖ్యంగా పార్టిషన్స్, సబ్ డివిజన్స్ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, ఇలాంటివి పార్టిషన్, సబ్ డివిజన్ చేసి అర్జీ క్లోజ్ చేయవచ్చన్నారు. డిఆర్ఓ ఇంచార్జ్ శ్రీదేవి మాట్లాడుతూ గ్రామసభ నిర్వహించునపుడు కౌంటర్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బందర్ ఆర్డీవో ఎం వాణి, బంటుమిల్లి, మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడు, పెనమలూరు తాసిల్దార్లు జూమ్ కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు


# అమెరికాకు పోయి సాఫ్ట్ వేర్ డెవలప్ చేయడమే కాదు గుడివాడ అభివృద్ధికి డ్రైనేజీలను శుభ్రం చేయడానికైనా చెత్తను తొలగించడానికైనా సిద్ధం -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## -ప్రజలతో కలిసి డ్రైనేజీలు, రోడ్ల వెంబడి చెత్తను స్వయంగా తొలగించిన ఎమ్మెల్యే









గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు : ఎమ్మెల్యే వేనిగండ్ల రాము ఆధ్వర్యంలో గుడివాడ 35 వ వార్డులో శ్రమదానం ఐ లవ్ గుడివాడ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గుడివాడ టిడిపి కార్యాలయం ప్రజా వేదిక నుండి 35వ వార్డు రాయల అప్పారావు వీధి వరకు సామాజిక, స్వచ్ఛంద, సేవా సంస్థల సభ్యులు, విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రతపై ఎమ్మెల్యే రాము అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం స్థానిక ప్రజలతో 35వ వార్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలలో, రోడ్ల వెంబడి ఉన్న చెత్తను ఎమ్మెల్యే రాము స్వయంగా తొలగించారు. ఎండ వేడిని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే రామునే స్వయంగా పరిసరాలను శుభ్రం చేస్తుండటంతో విద్యార్థులు, ఎన్డిఏ కూటమి పార్టీల నాయకులు శ్రమదానంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.నేడు శుభ్రం చేసిన వీధులను ప్రజలకు అప్పగించామని,ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు గొప్ప ఆలోచనల నుండి పుట్టిన జన్మభూమి, శ్రమదానం కార్యక్రమాల్లో ప్రతిపాడు భాగస్వామ్యుడు కావాలన్నారు.శ్రమదానం ద్వారా ప్రజలు ,ప్రభుత్వం భాగస్వామ్యులై పనిచేస్తే మన ప్రాంతాలన్నీ బాగుపడతాయన్నారు. వ్యవస్థలన్నీ సర్వనాశనమైన ఆంధ్రప్రదేశ్ ను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎంతో కష్టపడుతున్నారనీ,వారి స్ఫూర్తితో మన ఊరును,మనమే బాగు చేసుకోవాలనీ ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. నేడు 5వందల మందితో ఒక ప్రాంతాన్ని పరిశుభ్రం చేసి రోడ్లపై కనీసం దుమ్ము కూడా లేకుండా ప్రజలకు అప్పగించామని,చంద్రబాబు స్ఫూర్తితోనే తాము ఐ లవ్ గుడివాడ ప్రాజెక్ట్ ను ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.ప్రజల్లో స్ఫూర్తి కలిగించేలా గుడివాడ వ్యాప్తంగా జన్మ భూమి, శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తామని, మన పరిసరాలను శుభ్రం చేసుకునే, శ్రమదానం అంటే తనకు ఎంతో ఇష్టమని ఎమ్మెల్యే రాము అన్నారు. శ్రమదానం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, జనసేన పట్టణ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, బిజెపి అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున్, 35 వార్డు పెద్దలు, లయన్స్ క్లబ్, భారత్ వికాస్ పరిషత్, వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్, పలు కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పలు స్వచ్ఛంద, సామాజిక, సేవా సంస్థల సభ్యులు, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు, ప్రజానీకం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పని సర్దుబాటులో సవరణలు చేయాలి

## డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్



విజయవాడ, తెలంగాణ ముచ్చట్లు : పనిలో సర్దుబాటు కోరుతూ క్రింది అంశాలు పరిగణనలోకి తీసుకోమని డైరెక్టర్ , పాఠశాల విద్యాశాఖ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అమరావతి వారిని కోరినట్లు డెమో క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. నరహరి ఎన్ వి . రమణయ్య. రాష్ట్ర కార్యదర్శి రావెళ్ల వరుణ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. పని సర్దుబాటు ఒక మండలం లో ఎంతమంది అవసరము అంతమేర వరకే చేయాలి. ప్రాథమికోన్నత పాఠశాలలో 97 కంటే తక్కువ ఉంటే కనీసం మూడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలి. తెలుగు , హిందీ ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానాలు గత రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి సంబంధిత మెథలాడజీ కలిగిన ఉపాధ్యాయులు లేరు. వర్క్ అడ్జస్ట్మెంట్ చేయడానికి కూడా సంబంధిత ఉపాధ్యాయులు లేరు. అలాంటి సందర్భాలలో ఆయా పాఠశాలల నుండి సర్ ప్లస్ కు గురవుతున్న ఉపాధ్యాయులను మినహాయించినచో వాళ్లే సంబంధిత తెలుగు హిందీ సబ్జెక్టులను ఇప్పటి వరకు బోధిస్తున్నారు. కనుక వారే మళ్లీ బోధిస్తారు. కావున వారిని సర్ప్లస్ జాబితా నుండి మినహాయించవలసినదిగా కోరుచున్నాము. వర్క్ అడ్జస్ట్మెంట్ లో ఏప్రిల్ 30 వరకు పదవి విరమణ చేయబోతున్న ఉపాధ్యాయులను మినహాయించారు. కానీ ఆగస్టు నెల నుండే పదవీ విరమణలు చేసే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇదే నెలలో పదవీ విరమణ చేసే పాఠశాలలో 4 సర్ ప్లస్ లు ఉన్నాయి. (ఉదా : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెంబర్-1, అనంతపల్లి , తూర్పుగోదావరి) మరో రెండు వారాల్లో పదవీ విరమణ ఖాళీ ఏర్పడుతున్నందున అలాంటి పాఠశాలల్లో ఒకరిని సర్ ప్లస్ నుండి మినహాయించవలసిందిగా కోరుచున్నాము. హై స్కూల్ ప్లస్ పాఠశాలలను వర్క్ అడ్జస్ట్మెంట్ నుంచి మినహాయించారు. కానీ ఆ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను డిస్ప్లేట్ లో చూపలేదు. కావున చూపవలసిందిగా కోరుచున్నాము. తూర్పుగోదావరి , నల్లజర్ల మండలం లోని పోతవరం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ నందు ఒక హిందీ టీచర్ ఏడాదికి పైగా గైర్హాజరు లో ఉన్నారు. మరొక హిందీ పోస్ట్ ఖాళీగా ఉంది. దాన్ని వర్క్ అడ్జస్ట్మెంట్ లో డిస్ప్లేట్ ఉంచవలసిందిగా కోరుచున్నాము.ఉన్నత పాఠశాలల్లో ఉన్న మొత్తం రోలు ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలి.

# ఏపిఎంపిఏ గుడివాడ నూతన కార్యవర్గం ఏకగ్రీవం


## - నియోజకవర్గ అధ్యక్షునిగా ఉల్లి సాంబశివరావు, కార్యదర్శిగా పిల్లా శేఖర్



గుడివాడ,తెలంగాణ ముచ్చట్లు : ఏపీఎంపీఏ గుడివాడ నియోజకవర్గ అధ్యక్షులుగా ఉల్లి సాంబశివరావు (ఆంధ్రప్రభ), కార్యదర్శిగా పిల్లా శేఖర్(బిగ్ టీవీ), కోశాధికారిగా అడపా రంగనాద్ (వార్త మండల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం స్థానిక కృష్ణజ్యోతి కార్యాలయ ప్రాంగణంలో ఏపీఎంపిఏ కార్యవర్గ సమావేశం జరిగింది. ఏపీఎంపీఏ రాష్ట్ర కోశాధికారి మత్తి శ్రీకాంత్, జిల్లా కోఆర్డినేటర్ అల్లాడ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశంలో జి శ్యాంబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో ఏర్పడిన కమిటీని సభ్యులందరికీ ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుగా తలశిల నాగేశ్వరరావు(కృష్ణ జ్యోతి), గౌరవ అధ్యక్షులుగా డి.ఎస్ ధన్వంతరి(గుడివాడ ప్రగతి), ఉపాధ్యక్షులుగా జి.రాంబాబు, నత్త ఏడుకొండలు(ఆంధ్రజ్యోతి), జాయింట్ సెక్రటరీగా కాశీం(టీవీ9), కోటయ్య(ప్రజాశక్తి), ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్.పండుబాబు(సివిఆర్ న్యూస్), పెద్ది లోకేష్(కృష్ణ జ్యోతి), కార్యవర్గ సభ్యులుగా ఎం వంశీకృష్ణ(కలంకౌంటర్), ఐ.నారాయణ (ఆంధ్రప్రభ), దారపురెడ్డి ప్రసాద్(ప్రైమ్ 9), పి రాజేష్(నవజనత), గూడపాటి నరేష్ (రియల్ న్యూస్ )లు ఎంపికయ్యారు. కాగా నూతనంగా ఎంపికైన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు. రానున్న కాలంలో జర్నలిస్టుల సంక్షేమానికి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలియజేసింది.

# బాధితులకు తక్షణమే మేలు జరిగేలా అర్జీలను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి




బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు : బాధితులకు తక్షణమే మేలు జరిగేలా అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతి పత్రాల ద్వారా కలెక్టర్ కు విన్నవించారు. మొత్తంగా 155 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి పరిశీలన, విచారణ చేయాలంటూ సంబంధిత అధికారులకు పురమాయించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రెవెన్యూ సదస్సులు ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదవుతున్న అర్జీలలో 60 శాతం రెవిన్యూకి సంబంధించిన సమస్యలే ఉండడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. 277 రెవెన్యూ గ్రామాలలో 45 రోజులపాటు ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

TELTEL12273

మంగళవారం 13 -08- 2024

వరంగల్



# రెవిన్యూ సదస్సులకు ఆర్ పి సిసోడియా

## విజయనగరం, విశాఖలలో నాలుగు రోజుల పర్యటన



మచిలీపట్నం, తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రెవిన్యూ సదస్సులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవిన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు) ఆర్ పి సిసోడియా స్వయంగా హాజరవుతున్నారు. పదహేనవతేదీ సాయంత్రానికి విశాఖపట్నం చేరుకుని, 16వ తేదీ ఉదయం విజయనగరం వెళతారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోనే అందుబాటులో ఉండి అక్కడి రెవిన్యూ సదస్సులను అకస్మికంగా సందర్శిస్తారు. కనీసం సాయంత్రం లోపు రెండు, మూడు సదస్సులకు హాజరుకావాలని సిసోడియాను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తిరిగి రాత్రికి విశాఖపట్నం చేరుకుని 17వ తేదీ ఉదయం నుండి సాయంత్రం వరకు విశాఖపట్నంలో బస చేస్తారు. స్దానికంగా ఉన్న శాసనమండలి ఎన్నికల కోడ్ ను దృష్టిలో ఉంచుకుని రెవిన్యూ సదస్సులకు నేరుగా హాజరు కాకూడదని నిర్ణయించుకున్నారు. అయితే విశాఖపట్నం కలెక్టరేట్ తో సహా స్దానిక రెవిన్యూ కార్యాలయాలను సందర్శించి ప్రభుత్వ ప్రాధాన్యతలపై అధికారులతో సమావేశం అవుతారు. మదనపల్లి సంఘటన నేపథ్యంలో అయా కార్యాలయాలలో రెవిన్యూ దస్త్రాల భద్రతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 18వ తేదీ ఉదయం విశాఖపట్నం నుండి రోడ్డు మార్గంలో బయలు దేరి విజయవాడ చేరుకుంటారు.

# రాష్ట్రంలోని సహజ వనరుల్ని కాపాడుకుంటాం

## - నేషనల్ మినలరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ 6వ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర







న్యూఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలో అంతులేని సహజ వనరులున్నాయని, వాటిని రాష్ట్ర అభ్యున్నతికి వినియోగిస్తామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు %d% ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఢిల్లీలో కేంద్ర గనులు, బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి, అనుశాఖ సహాయమంత్రి డా.జితేంద్ర సింగ్, కేంద్ర మైనింగ్ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దుబే ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మినలరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ 6వ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి జ్ఞాపిక అందించి, శాలువాతో మంత్రి కొల్లు రవీంద్ర సత్కరించారు.ఆంధ్రప్రదేశ్ లో అపారమైన సహజ వనరులు, విభిన్నమైన ఖనిజ వనరులు ఉన్నాయని, వాటిని సరైన మార్గంలో వినియోగించుకుంటే రాష్ట్రం అభివృద్ధిలో దేశానికి మార్గదర్శిలా నిలుస్తుందని అన్నారు. వనడియం, టైటానియం, నికెల్, ఫోస్ఫోరైట్, ఫాస్పేట్, గ్రాఫైట్, లిథియం, ప్లాటినం లాంటి విలువైన వనరులు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న వనరులని సాంకేతికంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా 1996 లో నేషనల్ మినరల్ ఎక్స్ ప్లోరేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేసింది. మినరల్స్ తవ్వకాలకు 2% సీనరేజ్ ఫీజుగా నిర్ణయించారు. ఆ సొమ్మునే రాష్ట్ర ఖనిజన్వేషణకు వినియోగిన్స్తున్నారు. ఈ వ్యవస్థ సేవలను సమగ్రంగా వినియోగించుకోవడం, మెరుగు పరచడమే లక్ష్యంగా ప్రయత్నాలు చేస్తున్నాం. అదే సమయంలో రాష్ట్రంలోని మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర నిఘా కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయదలిచామని, అందుకు కేంద్ర ప్రభుత్ర గనుల శాఖ కార్యదర్శి కాంతారావుని సహకారం అందించాలని అడిగారు. ఆంధ్రప్రదేశ్ కు దాదాపు 972 కి.మీ.ల తీర ప్రాంతం ఉన్నందున సముద్ర ప్రాంతంలో వనరుల అన్వేషణకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. తద్వారా.. పాలీమెటాలిక్ నోడ్యూల్స్, పాలీమెటాలిక్ సల్ఫైడ్‌లు మరియు ఇతర వనరులు కూడా అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఆఫ్‌షోర్ మైనింగ్ యాక్ట్ 2002కి ఇటీవలి సవరణలు, ఆఫ్‌షోర్ ఖనిజాలున్న ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడానికి వీలు కల్పించడంపై చర్చించారు. తీరప్రాంత రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు రాబోయే ఆఫ్‌షోర్ మైనింగ్ నిబంధనలను పరిశీలించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విన్నవించారు. ఆఫ్‌షోర్ మైనింగ్ వేలంలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, అందుకోసం ప్రత్యేకంగా సీ బెడ్ మైనింగ్ కార్పొరేషన్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. కార్యక్రమంలో అస్సాం మైన్స్ అండ్ మినరల్ డెవలప్మెంట్ శాఖ మంత్రి జోగన్ మోహన్, ఛత్తీస్ ఘర్ ఆరోగ్య శాఖ మంత్రి శ్యాం బిహారి జైస్వాల్, గుజరాత్ పరిశ్రమల శాఖ మంత్రి బల్వంత్ సింగ్ రాజ్ పుత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల గరిష్ట విక్రయాలే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ప్రదర్శనలు

## - రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత






విజయవాడ, తెలంగాణ ముచ్చట్లు : చేనేత వస్త్రాల గరిష్ట విక్రయాలే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.నగరంలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత ప్రదర్శనను సోమవారం ఆమె సందర్శించారు. ప్రదర్శనలో ప్రతి స్టాల్ వద్దకు వెళ్లిన మంత్రి నేతన్నలను పలుకరించారు. ఏయే రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేశారు.. రోజూ ఎంత మేర అమ్మకాలు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరులతో మాట్లాడుతూ ఈ వస్త్ర ప్రదర్శన ఈ నెల 20 తేదీ వరకు నిర్వహించాలని తొలుత నిర్ణయించామని, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఎగ్జిబిషన్ ను మరో వారం రోజుల పాటు పొడిగించనున్నట్లు మంత్రి తెలిపారు. చేనేత వస్త్రాల అమ్మకాల్లో దళారుల ప్రమేయం లేకుండా, నేతన్నల కు మేలు కలగజేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. నేతన్నలకు శిక్షణ ఇచ్చి ఈ కామర్స్ లో చేనేత వస్త్రాలు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నేతన్నలకు 365 రోజులు పని కల్పించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వస్త్ర ప్రదర్శనను పరిశీలించడానికి మంత్రి సవిత ఆప్కో స్టాల్ దగ్గర 2 చీరలు, చీరాల స్టాల్ దగ్గర డ్రెస్ మెటీరియల్ కొనుగోలు చేశారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి కూడా చీరలు కొనుగోలు చేశారు. వస్త్ర ప్రదర్శనకు వచ్చిన కొనుగోలు దారులతో మంత్రి సవిత ముచ్చటించారు. వస్త్ర ప్రదర్శన వల్ల మేలు కలిగిందా అన్న మంత్రి ప్రశ్నకు కొనుగోలు దారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, నాణ్యమైన వస్త్రాలు కొనుగోలు చేసే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కొనుగోలుదారులకు, నేతన్నలకు ఆహ్లాదం కలిగించేలా ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, వాటిని తిలకించిన మంత్రి కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆప్కో ఎండీ పవన్ మూర్తి, చేనేత జౌళి శాఖ సంయుక్త సంచాలకులు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

## - మీకోసం అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలిశా

## - 182 అర్జీలు రాక - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు, తెలంగాణ ముచ్చట్లు : మీకోసం( ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) అర్జీలు పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని జిల్లా కలెక్టర్ కెవెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం లో ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు యం. ముక్కంటి, కె. భాస్కర్, అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా 182 అర్జీలు మీకోసం లో నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులు ఆదేశించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీ దారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్ఎల్ఎ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కర తీరు ఉండాలన్నారు.

**అందిన అర్జీలలో కొన్ని....**

కొయ్యలగూడెం మండలం కుంటలగూడెంకు చెందిన కాట్రగడ్డ హనుమాన్ శివప్రవీణ్ అర్జీనిస్తూ తమ భూమిలో 30 సెంట్లు తగ్గివున్నట్లు రికార్డులో ఉందని సర్వేచేసి సదరు భూమి వివరాలు అందించాలని కోరారు. దక్షిణపువీధికి చెందిన వడ్డీ సాయి అర్జీనిస్తూ డ్రైనేజి కాలువలో పూడికతీసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏలూరు గొల్లయిగూడెంకు చెందిన గొడగాని దుర్గ అర్జీనిస్తూ పేదలకు ఉచితంగా అందించిన ఇళ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిపే చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటాపురం పోణంగిరోడ్డు రాజరాజేశ్వరీ నగర్ కు చెందిన డి. సూర్యప్రకాశరావు అర్జీనిస్తూ తమ ప్రాంతంలో ఎయిర్ టెల్ టవర్ వేస్తున్నారని దీనివల్ల రేడియేషన్ సమస్య ఉంటుందని ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బుట్టాయిగూడెం మండలం రామన్నపాలెంకు చెందిన తిరివీధుల ప్రమీలారాణి అర్జీనిస్తూ ఫోక్సోకేసుకు సంబంధించి పరిహారం ఇప్పించాలని కోరారు.

# శ్రీశైలం మల్లన్న ను దర్శించుకోవడానికి పోటెత్తిన భక్తజనం



శ్రీశైలం, తెలంగాణ ముచ్చట్లు : నేడు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున సమేత శ్రీశైలం కు శ్రావణ మాసం,ఆదివారం సెలవు సోమవారం రోజు కావడంతో శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు తెల్లవారుజాము నుంచే కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించి అనంతరం పాతాళ గంగలో స్నానమాచరించి అనంతరం స్వామివారి దర్శనానికి ఉదయం 4:00 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం కాగా భక్తులు క్యూ లైన్ లో గుండా స్వామి అమ్మవార్లను దర్శించు కోవడానికి, 300టికెట్ దర్శనానికి 2:00గంటల సమయం,150 దర్శనానికి 3:00గంటలు,ఉచిత దర్శనానికి 5:00 గంటలు సమయం పడుతుంది. 20 కంపార్ట్మెంట్లలో శ్రీస్వామి, అమ్మవారి దర్శనార్థమై భక్తులు వేచి ఉన్నారు.భక్తులకు అల్పాహారం,మంచినీరు,మజ్జిగ సేవకులు అందజేయడం జరుగుతుంది.

# ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు

## - రెవెన్యూ సదస్సులలో చురుకుగా పాల్గొనండి - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల, తెలంగాణ ముచ్చట్లు : జిల్లాలో ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు పగడ్బందీ ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రెవెన్యూ డివిజనల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15వ తేదీ రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభించనుందని... ఈ మేరకు ఈనెల 15 నుండి సెప్టెంబర్ 30 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించి సంబంధిత షెడ్యూల్ ను సిద్ధం చేసి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల పరిశీలనకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించిందన్నారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూ అక్రమణలు, 22 %ఆ% భూముల అక్రమాలతో పాటు, పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆన్లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సదస్సులకు హాజరయ్యే రెవెన్యూ బృందాలు ఆర్ఓఆర్, అడంగల్, సంబంధిత రెవెన్యూ రికార్డులను వెంట తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. తీసుకున్న ప్రతి ఫిర్యాదుకు సంబంధిత అర్జీదారునికి రసీదు ఇవ్వాలన్నారు. తహసీల్దారు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్, రిజిస్ట్రేషన్, ఫారెస్ట్, బ్యాంకర్లు సంబంధిత అధికారులను రెవెన్యూ సదస్సులలో భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామమంతా కలియ తిరిగి రీ సర్వే పనులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. రైతులకు పంపిణీ చేసినచేసిన భూహక్కు పత్రాలను వెనక్కి తీసుకోవడంతోపాటు వాటి స్థానంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273

# భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి







ఒంగోలు, తెలంగాణ ముచ్చట్లు : భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 16 నుంచి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ, సచివాలయం మరియు గ్రామ వాలంటీర్ శాఖ మంత్రివర్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో రెవిన్యూ సదస్సులపై జరిగిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని మాట్లాడుతూ, భూ సంబంధిత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నెలకొనివున్న భూ వివాదాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజల వద్దకే పాలన' తరహాలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ఈ నెల 15న ప్రారంభించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు 16వ తేదీ నుంచి 45 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందని మంత్రి తెలిపారు. మరో 45 రోజుల్లో సమస్య పరిష్కా రంపై దృష్టి సారించడం జరుగుతుం దని మంత్రి వివరించారు. నిజమైన లబ్దిదారునికి న్యాయం జరగడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని, గ్రామ స్థాయిలో నెలకొని వున్న భూ సమస్యలను గ్రామాల్లో జరిగే రెవిన్యూ సదస్సుల దృష్టికి తీసుకొని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని ఈ సందర్భంగా మంత్రి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, మీ కోసం కార్యక్రమంలో వచ్చే సమస్యల్లో 80 నుండి 90 శాతం రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు రావడం జరుగుచున్నదని, వీటికి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు మొత్తం 45 రోజులపాటు జిల్లా అంతటా పూర్తిస్థాయిలో అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నెల 13వ తేదీ నాటికి గ్రామాల వారీగా సదస్సుల నిర్వహణ షెడ్యూల్ ను రూపొందించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఉదయం 9 గంటల నుంచి రెవిన్యూ సదస్సు ప్రారంభ మౌతుందని, ఈ కార్యక్రమంలో అన్నీ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు భాగస్వాములను చేయడంతో పాటు గ్రామాల్లో రెవిన్యూ సదస్సుల ఆవశ్యకత పై విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రెవిన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను ఏరోజుకారోజు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని కూడా నియమించడం జరిగిదని కలెక్టర్ తెలిపారు. ఈ రెవిన్యూ సదస్సు లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, అటవీ శాఖ అధికారి తో కూడిన కమిటి పాల్గొనటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. తొలుత జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ విశ్వేశ్వర రావు, ఈ నెల 16 తేదీ నుండి జరగన్ ఉన్న రెవిన్యూ సదస్సుల ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో పెద్ద ఎత్తున ప్రభుత్వ మరియు అసైన్డ్ భూములు ఆక్రమణకు గురి కావడం జరిగిందని, వాటిని పూర్తి స్థాయిలో పరిశీలనా చేసి నిజమైన లబ్దిదారులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, అలాగే గతంలో వున్నా అసైన్డ్ కమిటీ ని తిరిగి పునర్దరించాలని ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరడం జరిగింది. జాయింట్ కలెక్టర్ శ్రీ ఆర్. గోపాల క్రిష్ణ, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల అమ్మకమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్ లు

## రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

విజయవాడ, తెలంగాణ ముచ్చట్లు : చేనేత వస్త్రాల అమ్మకమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా చేనేత ఎగ్జిబిషన్ లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రివర్యులు శ్రీమతి ఎస్.సవితగారు తెలిపారు. నగరంలోని మారిస్ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎగ్జిబిషన్ లో ప్రతి స్టాల్ వద్దకు వెళ్లి నేతన్నలను పలుకరించారు. ఏయే రాష్ట్రాల నుంచి వచ్చి స్టాళ్లు ఏర్పాటు చేశారు.. రోజూ ఎంత మేర అమ్మకాలు అని మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఈ నెల ఏడో తేదీన గాంధీ బునకర్ మేళా పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారన్నారు.

# ఎయిడ్స్ వ్యాధి కట్టడి "మీకు తెలుసా?"


## - పూర్తి అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ
## - ఎయిడ్స్ నుండి రక్షణకు క్రమశిక్షణా జీవితమే మార్గం..
## - జిల్లా కలెక్టర్ డా. జి. సృజన



ఎన్‌టిఆర్ జిల్లా,తెలంగాణ ముచ్చట్లు : ఎయిడ్స్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పించివ్యాధిని నివారించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని క్రమశిక్షణా జీవితమే ఎయిడ్స్ వ్యాధి రక్షణకు ఏకైక మార్గమని, వ్యాధి బారిన పడిన వారి పట్ల వివక్షత చూపకుండా మనోధ్యైర్యాన్ని నింపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. సృజన అన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గన్కైజేషన్, స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థవైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మొగల్రాజపురం సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన హెచ్ఐవి అండ్ ఎస్‌టిఐ(సెక్స్‌వల్లీ ట్రాన్స్‌మీటెడ్ ఇన్‌ఫెక్షన్స్) అవగాహనలో భాగంగా "మీకు తెలుసా" ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్‌ను జిల్లా కలెక్టర్ జి.సృజన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దశల వారిగా నిర్వహించిన ప్రచార కార్యక్రమాల ద్వారా ఎయిడ్స్ మహ్మమారి భూతం అనే భయం పోగొట్టి ప్రజల్లో ధ్కైర్యం కల్పించడం ద్వారా వ్యాధిగ్రస్తుల కేసుల సంఖ్యను దాదాపు 86 శాతం తగ్గించడం జరిగిందన్నారు. ప్రజలలో మరింత అవగాహన కల్పించడం ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని పూర్తి స్థాయిలో అరికట్టగలుగుతామన్నారు. గతంలో "పులిరాజుకు ఎయిడ్స్ వస్తుందా?" అనే ఒక్క నినాదం ప్రజలనుఎంతో ఆలోచింప చేయగలి గిందన్నారు. నేటి "మీకు తెలుసా" కాంపెయిన్ ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఏవిధంగా వ్యాపిస్తుంది, నివారణ మార్గాలు, వ్యాధి పరీక్షలు నిర్వహించుకోవడం, వైద్య సేవలుపొందడం, కండోమ్ వాడకం, వ్యాధి నివారణ పై చర్చాగోష్టులు నిర్వహించడం, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా ఉండడం, టోల్ ఫ్రీ నెంబర్ 1097 ద్వారా సహకారం పొందడం, వైరల్‌లోడ్ తగ్గించడం వంటి అంశాలను మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక ప్రచార పద్ధతుల ద్వారా ప్రజలకు చేరువ చేసేందుకుచర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో ముఖ్యంగా ప్రజలు క్రమశిక్షణ జీవితాన్ని పాటించాల్సిన అవసరం ఉందన్నారు. చెడు వ్యసనాలు, విచ్చలవిడి శృంగారానికి పాల్పడడం వంటి వాటికి దూరంగా ఉండడం ఉత్తమమైన మార్గం అని జిల్లా కలెక్టర్ జి. సృజన అన్నారు. స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డ్కెరెక్టర్ డా. కామేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పూర్తి స్థాయిలో నివారించేందుకు "మీకు తెలుసా" ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం ఒక "థీమ్"ను తీసుకుని ఎనిమిది వారాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించేందుకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. 2023%-%24 సంవత్సరంలో ఎయిడ్స్ వ్యాధి మరణాల రేటును 76.04 శాతానికి తగ్గించగలిగామని, అవగాహన సదస్సుల ద్వారా 90 శాతం మరణాలను అరికట్టడంతో పాటు నూరు శాతం ఎయిడ్స్ నివారించాలన్నదే లక్ష్యమన్నారు. వ్యాధి బారిన పడిన వ్యాధిగ్రస్తులకు సంపూర్ణ పౌష్టికాహారాన్ని, మందులను అందించడంతో పాటు మానసిక ధ్కైర్యాన్ని కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. సృజన ఇంటెన్సిఫైడ్ కాంపెయిన్‌ను సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదలచేశారు. అనంతరంఎయిడ్స్ వ్యాధి అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా భాధ్యత కలిగిన పౌరునిగా పరిపూర్ణ చ్కెతన్యంతో మానవతా వాధిగా ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తానని... మనసా వాచా కర్మణతో అన్ని విషయాలలో ముందుంటానని.. నాతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటివారు మీకు తెలుసా కార్యక్రమంలో భాగస్వామ్యులు అయ్యేందుకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కెఎల్ యూనివర్సిటీ విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అహుతులను అలరించాయి.

# 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగించండి

## - మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి - బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి
## - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




నంద్యాల,తెలంగాణ ముచ్చట్లు : ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, విద్యాసంస్థల్లో చదువుతున్న 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను నమిలి మింగించేలా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనిహా జిల్లా కలెక్టర్జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జాతీయ నులిపురుగుల నిర్మూలనపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో నులిపురుగుల నియంత్రణ గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా విద్యార్థులు రక్తహీనతకు గురయ్యే ప్రమాదాన్ని నివారించేందుకు 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరిచే ఆల్బెండజోల్ టాబ్లెట్స్ ను మింగించేందుకు ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సిబ్బంది, సంక్షేమ వసతి గృహాల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తంహా 4,29,268హా పిల్లలు ఉన్నట్లు గుర్తించారని ఈ నెల 20 వ తేదిన ఆల్ బెండ జోల్ -400మీ.గ్రా. మాత్రలను మధ్యాహ్నము భోజనం తరువాత నమిలి మింగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1-2 సంవత్సరాల వయసు చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి తల్లి పాలతో కలిపి చెంచా ద్వారా ఇవ్వాలని, 3-19 సం. వయసుహా పిల్లలకు మధ్యాహ్నం భోజనం తరువాత ఒక మాత్రను పూర్తిగా చప్పరించి నమిలి మింగించేటట్లు అవగాహనా కల్పించాలనిహా సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రక్తహీనతకు ప్రధాన కారణమైన నులి పురుగులను నివారించేందుకు ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలను తప్పక తీసుకోవాలన్నారు. భోజనం ముందు భోజనం తర్వాత విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించేలా చరలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఏ ఒక్క విద్యార్థి ఆల్పెండజోల్ టాబ్లెట్ మింగకుండా ఉండకూడదని వైద్య బృందాలను కలెక్టర్ ఆదేశించారు.

**బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి**

బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులు ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలించేందుకు జిల్లాలో ఉన్న పరిశ్రమలు, హెూటళ్లు చెంచు గూడెంలు, ఇతర కర్మాగారాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలని సంబంధిత టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలందరినీ పనిలో పెట్టకుండా పాఠశాలకు పంపేలా చైతన్యం కలిగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాలు మొక్కుబడి రీతిలో నిర్వహిస్తూ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, హెూటళ్ళు, దుకాణాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించాలన్నారు. జిల్లా సమన్వయ కమిటీ సమావేశములో ఇన్చార్జి డిఎంహెచ్ఓ డా. శారద, పాల్గొన్నారు.

# సినిమా న్యూస్



## డార్క్ షేడ్ అందాలతో తెలుగమ్మాయి



డాన్స్ ట్యూటర్ గా కాలేజ్ డేస్ లోనే డాన్స్ ను తన కెరీర్ గా ఎంపిక చేసుకున్న తెలుగు అమ్మాయి తేజస్వి మదివాడ 2013 లో మహేష్ బాబు, వెంకటేష్ కలిసి నటించిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా లో సహాయ నటిగా నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో సమంత సోదరి పాత్రలో నటించి మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. సమంత కజిన్ లు గా ఆ సినిమాలో చాలా మంది కనిపించారు. కానీ తేజస్వి కి వచ్చిన గుర్తింపు మరెవ్వరికీ రాలేదు. ఆ సినిమా ఇచ్చిన గుర్తింపు తో ఇండస్ట్రీలో మంచి ఆఫర్లను తేజస్వి మదివాడ దక్కించుకుంది. ముఖ్యంగా ఐస్ క్రీమ్ తో పాటు హార్ట్ ఎటాక్ ఇంకా కొన్ని సినిమాల్లో నటించడం ద్వారా ఎక్కువ మంది ప్రేక్షకులకు నటిగా చేరువ అయ్యింది. ఐస్ క్రీం సినిమాలో ఒక సన్నివేశం కోసం తేజస్వి ఏకంగా పూర్తి నగ్నంగా కనిపించి సంచలనం సృష్టించింది. ఒక తెలుగు అమ్మాయి ఆ స్థాయిలో నటించడం ప్రథమం అంటూ ప్రముఖ మీడియాల్లో కథనాలు వచ్చాయి. ఆ సినిమా తర్వాత తేజస్వి కి చాలా ఆఫర్లు వస్తాయనే ప్రచారం జరిగింది. కానీ ఆమె వర్మ కాంపౌండ్ కు చెందిన అమ్మాయి అనే ప్రచారం జరగడంతో చాలా మంది ఆమెకు ఆఫర్లు ఇచ్చేందుకు ఆసక్తి చూపించలేదు అనే అభిప్రాయం ఉంది. చిన్న చిన్న పాత్రల్లో నటించడంతో పాటు, బుల్లి తెరపై కూడా తనదైన శైలిలో వినోదాన్ని పంచడం ద్వారా రెగ్యులర్ గా వార్తల్లో ఉంటుంది. 2018 లో బిగ్ బాస్ తెలుగు లో పాల్గొన్న ఈమె కొన్ని వివాదాల కారణంగా చాలా తొందరగా బయటకు వచ్చింది. ఆ షో వల్ల తేజస్వి కి మరింత నెగటివిటీ పెరిగింది అనేది కొందరి అభిప్రాయం. ఆ మధ్య పెళ్లి చేసుకునేందుకు ఆసక్తి చూపించింది. కానీ పెళ్లి చేసుకుంటే తన గుర్తింపు పోతుందనే ఉద్దేశ్యంతో పెళ్లి నిర్ణయాన్ని రద్దు చేసుకున్నాను అంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాలో అందాల ఫోటోలను తేజస్వి షేర్ చేసింది. ఈసారి డార్క్ షేడ్ అందాల ఫోటోలను ఈమె షేర్ చేసింది. బ్లాక్ అండ్ వైట్ తో పాటు చీకట్లో తేజస్వి ఉన్నట్లుగా ఈ ఫోటోలో చూడవచ్చు. అంత డార్క్ షేడ్ లోనూ తేజస్వి అందమైన రూపం చూపరుల దృష్టిని మరల్చనివ్వడం లేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఈ అమ్మడి అందాల ఫోటోలకు స్పందన లభిస్తోంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాకపోవడంకు కారణం తెలుగు అమ్మాయి అవ్వడమే అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రెట్టీ ఇన్ పింక్ లో ప్రగ్యాజైశ్వాల్ పేంపరింగ్

ప్రగ్యా జైశ్వాల్ ఇన్ స్టా సంచలనాల పరిచయంతో పనేముంది. చిట్టిపొట్టి దుస్తుల్లో మంటలు రేపిన సంద ర్భాలెన్నో. ఫ్యాషన్ వరల్డ్ లో తనకంటూ ఓ స్పెషల్ ఐడెంటిటీని దక్కిచుకుంది. చేతిలో సినిమాలు లేకపోయినా ఇంకా కాంపిటీషన్ లో ఉంది అంటే? అందుకు కారణం ప్రగ్యా లో ఆ రకమైన అప్పిరియన్స్ అనడంలో డౌట్ లేదు. సందర్భాన్ని బట్టి చిచ్చర పిడుగులా చెలరేగుతుంది. డిజైనర్ దుస్తుల్లో అగ్గిరాజేస్తుంది. తాజాగా అమ్మడు మరోసారి ఆల్ట్రా మోడ్రన్ బ్యూటీ లుక్ లో అదరగొట్టింది. లైట్ పింక్ కలర్ ఔట్ ఫిట్..అదమైన మ్యాకప్ లో సోయగం అగ్గిరాజేసింది. అమ్మడి హైట్ ని మ్యాచ్ చేస్తూ డిజైన్ చేసిన గౌనులో ఎంతో అందంగా ముస్తాబైంది. కాళ్లకు హై హీల్స్ ధరించింది, స్కిన్ టోన్ మరింత షైనింగ్ అవుతుంది. పాల నురుగుల సౌందర్యంతో ఆహా అనిపిస్తుంది. వయసు 36 దాటినా 26 బ్యూటీలా మురిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రగ్యా లో బ్యూటీని ఫ్యాన్స్ అంతే ఆస్వాదిస్తున్నారు. ప్రెట్టీ ఇన్ పింక్ అంటూ కుర్రాళ్లంతా పొగిడేస్తున్నారు. ఇక ప్రపోజల్స్ కైతే కొదలేదు. అమ్మడు ఇంకా పెళ్లి కూడా చేసుకోలేదు. బ్యూటీ అందానికి ఫిదా అయిన వారంతా తమదైన శైలిలో ప్రపోజ్ చేస్తున్నారు. ఇక ప్రగ్యాజైశ్వాల్ కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. తెలుగు..హిందీ..తమిళ్ లో సినిమాలు చేసినా ఎక్కడా నిలదొక్కుకోలేకపోయింది. ఈ రెండు భాషలకంటే బెటర్ గా తెలుగులోనే సినిమాలు చేసింది. ఈ మధ్యనే తన తొమ్మిదేళ్ల క్రితం నాటి కల నిజమయ్యే మరో



అవకాశం అందుకుంది. అక్షయ్ కుమార్ ..తాప్సీ ..వాణీ కపూర్ నటించిన సినిమా %-%ఖేల్ ఖేల్ మే%-% చిత్రంలో ప్రగ్యా అవకాశం అందుకుంది. ఇందులో అమ్మడు ఓ కీలక పాత్ర పోషిస్తుంది. త్వరలోనే సినిమా రిలీజ్ అవుతుంది.


## ఫారిన్ బ్యూటీలా మురిపిస్తోన్న సీతమ్మ!



గ్లామర్ వరల్డ్ లో అందాల భామల మధ్య పోటీ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పనిలేదు. ఎవరైనా నిత్య నూతనంగా కనిపించాల్సిందే. అందులోనూ తాము సంథింగ్ స్పెషల్ అనిపించాలి. నలుగురి దారిలో వెళ్లడం కాదు. నలుగురు మన దారిలో నడిచేలా చేసినప్పుడే సక్సెస్ అవుతాం. భామల మధ్య పోటీని తట్టుకుని నిలబడాలంటే? ఎలివేషన్ పరంగా ఎంతో చేయాల్సి ఉంటుంది. ఆ విషయంలో కృతిసనన్ అలియాస్ సీతమ్మ ఏమాత్రం తగ్గదు. సక్సెస్ క్రేజ్ని తెలివిగా రెట్టింపు చేసు కుంటుంది. ఫ్యాషన్ వరల్డ్ లో తానో బ్రాండ్ అని ఇప్పటికే చాలా సందర్భాల్లో ప్రూవ్ చేసింది. డిఫరెంట్ డిజైనర్ కాస్ట్యూమ్స్ లో కృతికి పోటీ ఉంటుందా? అనిపించింది. తాజాగా అమ్మడు మరోసారి నెటి జనుల దృష్టిని ఆకర్షించే లుక్ తో వచ్చేసింది. ఇదిగో ఇక్కడిలా ఏకంగా విదేశీ మోడల్స్ నే తలపించింది. అమ్మడు కటౌట్ కి తగ్గ దుస్తులు ధరించి అచ్చంగా ఫారిన్ బ్యూటీ ఫీల్ తీసుకొచ్చింది. నడుం దగ్గర నుంచి కాళ్ల వరకూ ధరించిన పీస్..మ్యాచింగ్ టాప్ లో ధరించిన స్కిన్ టైట్ బ్లౌజ్ లో మోడ్రన్ బ్యూటీలా హైలైట్ అవుతుంది. ఇక అమ్మడి హెయిర్ స్టైల్ అయితే ఏకంగా రష్యన్ బ్యూటీనే తలపిస్తుంది. గోల్డ్ కలర్ సిల్కీ హెయిర్ స్టైల్ లో వావ్ అనిపిస్తుంది. బ్యాక్ గ్రౌండ్ ఎరుపు రంగు లొకేషన్ కృతిని మరింత ప్రకాశవంతంగా మలిచింది. కాళ్లకు హైహీల్స్ ధరించి..రెండు చేతులు చాచి వివిధ భంగిమల్లో కెమెరాకి ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతుంది. కృతిని ఇలాంటి ఫోజులో అభిమానులు ఇంతవరకూ చూడలేదు. దీంతో ఆ ఫోటో సంథింగ్ స్పెషల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇటీవలే %-%ది క్రూ%-%తో అమ్మడు మరో సక్సస్ ఖాతాలో వేసుకున్న సంగతి తెలిసిందే.

## మరాఠీతో నేషనల్ క్రష్ కుస్తీ!

రష్మిక మందన్న నేడు పాన్ ఇండియాలో ఓ సంచలనం. 'పుష్ప', 'యానిమల్' విజయాలతో నేషనల్ క్రష్ గా దూసుకుపోతుంది. ప్రస్తుతం అమ్మడి కెరీర్ ని బాలీవుడ్ లోనే ప్లాన్ చేసుకుంటుంది. అందుకు తగ్గట్టు అవకాశాలు అందుకుంటుంది. అయితే ఏ భాషకెళ్తే ఆ భాషలో అనర్గళంగా మాట్లాడటం రష్మిక ప్రత్యేకత. ఎలాగూ తంటాలు పడి భాషని ఈజీగా నేర్చుకుంటుంది. బేసిక్ గా అమ్మడు కన్నడిగి. అక్కడ నుంచి టాలీవుడ్ కి వచ్చింది. తొలి సినిమా 'ఛలో' సమాయనికి తెలుగు సరిగ్గా రాదు. కానీ ఆ తర్వాత కాలంలో తెలుగు భాష మాట్లాడటం చూసి అంతా షాక్ అయ్యారు. ఇంత స్వచ్ఛమైన తెలుగు ఎప్పుడు నేర్చుకుందని అంతా స్టన్ అయ్యారు. భాష వచ్చిన నాటి నుంచి అమ్మడు తనలో ఇంటర్నల్ ట్యాలెంట్ ని బయటకు తీసింది. లైవ్ లో ఆడయన్స్ కవ్వించడంలో అమ్మడు



దిట్ట. మాటలతోనే బూరెలు వండటం మొదలు పెట్టింది. అటుపై తమిళ్ లోనూ కొన్ని సినిమాలు చేసి ఆ భాష సైతం నేర్చుకుంది. అక్కడా మంచి ఫాలోయింగ్ సంపాదించింది. ఇక బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత తనలో వచ్చిన మార్పులెన్నో. అక్కడ కల్చర్కి తగ్గట్టు ఫ్యాషన్ ఎంపికల్లో ఎన్నో మార్పులు చేసింది. బికినీ,..స్విమ్ షూట్...చిట్టిపొట్టి దుస్తుల్లో కుర్రకారును హీటెక్కించడం..మీడియా సమావేశాల్లో హైలైట్ అవ్వడం తెలిసిందే. హిందీ భాషని అంతే వేగంగా నేర్చుకుంది. ప్రస్తుతం 'సవ్వా' అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. విక్కీ కౌశల్ హీరోగా లక్ష్మణ్ ఉట్టేకర్ తెరకెక్కిస్తున్నారు. మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో మరాఠీ పదాలు ఎక్కువగా మాట్లాడాల్సి వస్తోందిట. దీంతో ఈ భాషను తప్పక నేర్చుకోవాల్సింది దర్శకుడు రష్మికకు చెప్పారుట. దీంతో అమ్మడు ఇప్పుడు ఆ భాష కూడా సీరియస్ గా నేర్చుకుంటుందిట. కానీ నేర్చుకునే సమయంలో చాలా సవాళ్లే ఎదురవుతున్నాయట.

**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com